ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

3

గురువారం 4 జూలై 2024



నేటి నుంచి 'సదరమ్' స్లాట్ బుకింగ్‌లు

కలికిరి, జూలై 3: దివ్యాంగుల్లో ఉన్న వైకల్య స్థాయిని శాస్త్రీయంగా నిర్ధారించేందుకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షల కోసం గురువారం నుంచి స్లాట్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ, మీసేవా కేంద్రాల్లోనూ తగిన వివరాలు అందజేసి అనుకూలమైన తేదీని, పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేసుకునేందుకు నమోదు చేసుకోవచ్చు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి అవసరమైన తేదీని దివ్యాంగులు తమకు అనుకూలంగా ఎంపిక చేసుకోవచ్చు. శారీరక, మానసిక, ఈఎన్‌టీ, నేత్ర వైకల్యాన్ని నిర్ధారించేందుకు ఎంపిక చేసిన కేంద్రాల్లో స్క్రీనింగ్ పరీక్షలు జరపనున్నారు. అనంతరం ఆయా దివ్యాంగులకున్న వైకల్య శాతాన్ని నిర్ధారించి సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. మూడు నెలలకు కేటాయించిన స్లాట్‌లు పూర్తి కావడంతో తిరిగి రాబోయే మూడు నెలల కాలానికి అంటే సెప్టెంబరు 30వ తేదీ వరకు అవసరమైన స్లాట్‌లను గురువారం నుంచి విడుదల చేయనున్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పాఠశాలలు, విద్యాలయాల్లో ప్రవేశాలు, రైళ్ళు-బస్సు ప్రయాణాల్లో రాయితీలు, ప్రధానంగా సామాజిక పింఛన్లు పొందడం కోసం సదరం కేంద్రాలు జారీ చేసే వైకల్యానికి సంబంధించిన నిర్ధారణ సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుబాటవుతాయి. శారీరక, మానసిక, ఈఎన్‌టీ, నేత్ర వైకల్యాన్ని నిర్ధారించేందుకు ఆయా నిపుణులు స్క్రీనింగ్ పరీక్షలు చేసి ఈ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలు (ఏరియా ఆసుపత్రులు), జిల్లా ఆసుపత్రులు, బోధనా ఆసుపత్రుల్లో సదరమ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ప్రధానంగా సామాజిక పింఛన్ల కోసం దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్లు పొందడానికి ఎదురు చూస్తున్నారు. కొత్తగా పింఛన్ల కోసమే కాకుండా గత ప్రభుత్వంలో తొలగించిన పింఛను దారులు కూడా ఈ సర్టిఫికెట్లు పొందడానికి ప్రయత్నిస్తున్నారు.

కృతిమ కాళ్లు అమర్చడం కోసం ప్రత్యేక క్యాంపు

కాళ్లు కోల్పోయిన దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అమర్చడం కోసం ఈనెల 25వ తేదీ గురువారం కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరు కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కడప జిల్లా కలెక్టరు కార్యాలయం డి-బ్లాకులోనూ, అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటిలోని జిల్లా కలెక్టరు కార్యాలయంలోనూ ఒకేసారి ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జిల్లాలకు సంబంధించిన వారు మాత్రమే ఆయా జిల్లా కేంద్రాల్లో హాజరు కావలసి ఉంటుంది. ఈ శిబిరాలకు హాజరైన వారు కోరుకునే కృత్రిమ కాళ్ల కొలతలు తీసుకుంటారు. ఆపై 20 రోజుల తరువాత రూ.51 వేల విలువ గల తేలికపాటి కృత్రిమ కాళ్లను ఉచితంగా అమరుస్తారు. అవసరమైన దివ్యాంగులు ఈనెల 18వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకుని నిర్ణీత తేదీనాడు స్వయంగా హాజరు కావలసి ఉంటుంది. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మెడికల్ (సదరమ్) సరిఫికెట్ల జిరాక్సు కాపీలు, రెండు ఫొటోలు, మొబైలుతో హాజరు కావలసి ఉంటుంది. పేర్లు నమోదు కోసం కడప జిల్లాకు చెందిన వారు 99664 45110 లేదా 80746 23993 (హుస్సేన్), అన్నమయ్య జిల్లాకు చెందిన వారు 91827 78324 (రమేష్)లను సంప్రదించవచ్చని కలికిరి ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు.

చెప్పేందుకే నీతులు

ఇప్పటిదాకా ప్రభుత్వపాఠశాల భవనంలో పెచ్చులూడేవి. అయితే ఈసారి ఘనత వహించిన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కార్పొరేటరుగా ఉన్న విద్యాసంస్థల భవనంలో పెచ్చులూడి విద్యార్థులు గాయపడటం విశేషం. ఈ భవనం విద్యాసంస్థల భవనాల ప్లానుకు విరుద్ధంగా ఉందంటారు. ఏదైనా ఫైర్ జరిగినప్పుడు పై అంతస్తుల్లో ఉన్న విద్యార్థులను క్షేమంగా కిందకు దించేందుకు రెండు వరుసల దారులు ఉండాలి. ఇక్కడ ఒకటి మాత్రమే ఉంది. ఈ స్థలం విషయమే వివాదాస్పదంగా ఉంది. దీనిపై న్యాయస్థానంలో ఉన్నాయంటారు. అయితే ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి వైసీపీ నేత కావడం గత ఐదేళ్లలో జగన్ అండ్ కో పాలన ఉండడంతో ఎలాంటి లోపాలు ఉన్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదంటారు. ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉండడంతో లోపాలన్నీ ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి.



జాతీయ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సాయిబాబా స్కూలు

- నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్సీ
- ఫైర్ అనుమతి లేకున్నా పాఠశాల కొనసాగింపు
- జాతీయ రహదారి పక్కనే పాఠశాల
- అన్ని విద్యాసంస్థలు ఒకేచోట
- నాసిరకం బిల్డింగుతో పెచ్చులూడి..
- ఆరుగురు విద్యార్థులకు గాయాలు
- చికిత్స కోసం ఒకరు హైదరాబాదుకు
- ఎమ్మెల్సీ, కార్పొరేటర్‌పై కేసు నమోదు



పాఠశాల పైకప్పులో పెచ్చులూడిన దృశ్యం

(కడప - ఆంధ్రజ్యోతి): చెప్పేందుకే నీతులు.. తీసేవన్నీ గోతులు అన్నట్లుగా ఉంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తీరు. ఎందుకంటే ఆయన విద్యార్థుల, ఉపాధ్యాయ సమస్యలను శాసనమండలిలో ప్రశ్నించాల్సిన వ్యక్తి. అలాంటి సారుకు చెందిన విద్యాసంస్థల్లో చదువుతున్న పిల్లలకు నేడు భరోసా లేని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అంటే సాయిబాబా విద్యాసంస్థల అధినేతగా పేరుంది. ఈయనకు హైస్కూలు సెక్షనే కాదు ఉన్నత స్థాయి విద్యాసంస్థలు ఉన్నాయి. ఎమ్మెల్సీ కాకముందు ఈయన ప్రైవేటు స్కూళ్లకు అధ్యక్షుడుగా పనిచేశారు. విద్యావ్యవస్థపై అపారమైన నమ్మకం ఉందంటారు. ఈయన ఎమ్మెల్సీ కావడం ఈయన భార్య కార్పొరేటరు కావడంతో సాయిబాబా విద్యాసంస్థలన్నీ నిబంధనల ప్రకారమే ఉన్నాయనుకోవడం సహజం. అయితే పైన పటారం లోన లొటారం అన్నట్లుగా సాయిబాబా విద్యాసంస్థల భవన నిర్మాణాలు ఉన్నట్లు అర్థమవుతుంది. ఎందుకంటే ఆ పాఠశాల ఎంట్రెన్స్‌లో పాఠశాల ఎలివేషన్ అద్భుతంగా ఉంటుంది. అయితే మంగళవారం సాయిబాబా స్కూలు పాఠశాలలో శ్లాబ్ పెచ్చులూడి ఆరుగురు విద్యార్థులు గాయపడ్డంతో లోపల ఉన్న డొల్లతనం బయటపడింది. ఈ విషయం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

కరుడు గట్టిన వైసీపీవాది, విద్యావేత్త, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి. శాసనమండలిలో అటు ఉపాధ్యాయ ఇటు విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తారని.. ఆయనపేరు మారుమోగుతుందని కడపలోని విద్యావేత్తలు భావించారు. అయితే ఎమ్మెల్సీ తాను స్వయంగా నిర్వహిస్తున్న పాఠశాల భవనం పెచ్చులూడి ఆయనే వార్తల్లో నిలవడం తీవ్ర దుమారం రేపుతోంది.

అనుమతులు నిల్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాఠశాల అంటే అన్ని అనుమతులు ఉంటాయనుకుంటారు. అయితే ఈయన అధికారం, పేరు అడ్డుపెట్టుకుని స్కూలు నిర్వహణలో అవకతవకలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. సాయిబాబా స్కూలు కేంద్రంగానే ఇతర విద్యాసంస్థలను నడుపుతున్నారంటారు. ఇక్కడనే ఇతర విద్యాసంస్థలు ఉన్నాయంటారు. ఈ కళాశాల స్థలం వివాదాస్పదంగా మారడంతో న్యాయస్థానానికి చేరిందంటారు. అయితే ఎమ్మెల్సీ సతీమణి శ్రీదేవి ఇదే డివిజన్ కార్పొరేటరు కావడంతో ఇక్కడ నిబంధనల ఉల్లంఘన జరిగిందంటారు. సాయిబాబా పాఠశాలలో కనీస నింబంధనలు పాటించకుండా క్లాసులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భవనాల పటిష్టతను పట్టించుకోకుండా పాత బిల్డింగులోనే నిర్వహిస్తూ ఇచ్చారు. పైన పటారంగా బయట ఎంత ఎలివేషన్ ఇచ్చినా బిల్డింగు లోపల నాణ్యత లేకపోతే పెచ్చులూడుతాయి అనేదానికి సాయిబాబా స్కూలు నిదర్శనం.

అంతా డొల్ల

ఎవరైనా సరే.. నర్సరీ టు టెన్త్.. ఇంటర్ టు డిగ్రీ ఆపై విద్యాసంస్థలు ప్రారంభించినా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. కళాశాల భవనాలు, ల్యాబ్‌లు విద్యార్థులు వచ్చిపోయే దారులు, ఫైర్ జరిగినప్పుడు వెళ్లే ప్రత్యామ్నాయ రహదారి, ఆడుకునేందుకు గ్రౌండ్.. ఇలా అన్నింటినీ పరిశీలించిన తరువాతనే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో చంద్రబాబు హయాంలో చిన్న తప్పు ఉన్నా అనుమతలుఉ ఇచ్చేవారు కాదు. అయితే వైసీపీకి చెందిన రామచంద్రారెడ్డి విషయంలో నిబంధనలకు నీళ్లొదిలారనే ఆరోపణలున్నాయి. ఆ పాఠశాల భవనం న్యాయస్థానంలో ఉంది. బయట ఎలివేషన్ సూపర్‌గా ఉంది. ఏదైనా ఫైర్ జరిగితే వివిధ అంతస్తుల్లో ఉన్న విద్యార్థులు ప్రాణాలతో బయటికి వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రధానంగా ఈ స్కూలు చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారికి ఆనుకునే ఉంది. స్కూలులో మధ్యాహ్నం పూట లంచ్ కోసం, సాయంత్రం పూట పిల్లలు ఇంటికి వెళుతుంటారు. ఇది జాతీయ రహదారి కావడంతో పిల్లలు రోడ్డు దాటేందుకు కనీస ప్రమాణాలు లేవు. ఇదంతా అధికారులు పట్టించుకోకుండా వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.

ఫైర్ అనుమతి లేదు.

సాయిబాబా స్కూలు గత ఐదేళ్లుగా ఫైర్ అనుమతి తీసుకోలేదని జిల్లా ఫైర్ అధికారి వెల్లడించారు. మంగళవారం పైకప్పు పెచ్చులూడి పడి ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి కడప తాలూకా పోలీసుస్టేషన్‌లో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి శ్రీదేవిపై నూతన చట్టాలు 125/ఎ ప్రకారం కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కేసు నమోదైంది. పాఠశాలలో పెచ్చులూడి పడి ఆరుగురు విద్యార్థులకు గాయాలై ఒకరిని వైద్యం కోసం హైదరాబాదుకు పంపించారంటే పరిస్థితి ఎంత తీవ్రమో అర్థమవుతుంది. సాయిబాబా స్కూలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారనే వాదనను నిజం చేస్తుంది. ఇక్కడ నిబంధనలు పాటించలేదని దీనిపై చర్యలు తీసుకోవాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ గత నెలలోనే విద్యాశాఖకు, కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం పెచ్చులూడిపడి గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సైతం ఆదేశించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

రాయచోటిటౌన్, జూలై 3: అన్నమయ్య జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంతర్ జిల్లాల దొంగను బుధవారం రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం రాయచోటి పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భక్తవత్సలం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రాయచోటిలో జరిగిన ద్విచక్రవాహనాల చోరీలపై ఎస్పీ కృష్ణారావు, రాయచోటి డీఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రాయచోటి సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భక్తవత్సలం పోలీస్ సిబ్బందితో కలిసి రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో దొంగను పట్టుకున్నారు. పెద్దమండెం మండలం ముసలికుంట గ్రామం గోనుపోతులారిపల్లె తండాకు చెందిన వెంకట్రమణనాయక్ కుమారుడు బుక్కే అశోక్‌నాయక్ అలియాస్ కుమార్‌నాయక్‌ను పట్టుకొని విచారించగా అతను రాయచోటిటౌన్‌తో పాటు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో 14 మోటారు సైకిళ్లను దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. అతడి వద్ద నుంచి 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలియజేశారు. నిందితుడిపై గతంలో మదనపల్లి, పుంగనూరు, గాలివీడు, ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో 21 మోటారు సైకిల్ దొంగతనం కేసులు నమోదయ్యాయని, ఆ కేసులో అతనికి గతంలో జైలు శిక్ష కూడా విధించిందని ఆయన వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు ఆయన తెలిపారు.





రాయచోటి అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

వైవీయూలో డిగ్రీ కోర్సులు

- ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం
- వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథ రెడ్డి



పాత్రికేయులతో మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 3: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020ని అమలుచేయడంలో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుంచి బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. బీఎస్సీ (ఆనర్స్) ఫిజిక్స్ సబ్జెక్టుతో పాటు కంప్యూటర్స్ సైన్స్, నానో-సైన్స్ కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్ టెక్నాలజీ విద్యార్థి ఎంపిక చేసుకుని చదివే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ (ఆనర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతో పాటుగా అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ చదువచ్చన్నారు. బీకాం (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్ ప్రధాన అంశంగా ఉందన్నారు. బిజినెస్ కామర్స్ కంప్యూటర్స్ సైన్స్ ఫైనాన్సియల్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్మెంట్ వంటి అంశాలతో బలమైన పునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్స్ ఉత్తమ మార్కులతో పూర్తి చేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ప్రపంచ అవసరాలకు తగ్గట్టు విద్యను అందించేందుకు వైవీయూ కట్టుబడి ఉందన్నారు. వినూత్న కోర్సులు, అత్యాధునిక ల్యాబ్‌లు, నిష్ణాతులైన అధ్యాపక బృందం వైవీయూలో ఉన్నాయన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కూడా ఉందన్నారు. సమావేశంలో వైవీయూ దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, డీన్ ప్రొఫెసర్ సుబ్బరాయుడు, ప్రొఫెసర్ అమృత ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎస్వీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు టన్నుల ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- నలుగురు స్మగ్లర్ల అరెస్టు
- ఎర్రచందనం అక్రమ రవాణాలో ఎవరు పాల్గొన్నా కఠిన చర్యలు
- మీడియా సమావేశంలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప (క్రైం) / ఎర్రగుంట్ల, జూలై 3: ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలోని జగనన్న కాలనీ వద్ద నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు రూ.1.91 కోట్ల విలువ చేసే నాలుగు టన్నుల ఎర్రచందనం దుంగలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు.

పోట్లదుర్తి గ్రామం ఇటుకల ఫ్యాక్టరీ వద్ద జగనన్న కాలనీలో ఉన్న దూదేకుల బాషా.. పోరుమామిళ్ల, బద్వేలు, సిద్దవటం పరిధిలో అటవీ ప్రాంతాల్లోకి కూలీలను పంపించి అక్కడ నుంచి ఎర్రచందనం దుంగలను వాహనాల ద్వారా పోట్లదుర్తి వద్దకు తీసుకువచ్చి తన ఇంట్లో నిల్వ ఉంచేవారన్నారు. తనిఖీలు తక్కువగా ఉన్న సమయంలో వాహనాల ద్వారా దుంగలను చెన్నైకి తరలించి బడా స్మగ్లర్లకు అమ్ముతున్నట్లు సమాచారం ఉందన్నారు. బుధవారం ఉదయం పోట్లదుర్తి గ్రామంలోని న్యూకాలనీ క్రాస్‌వద్ద రోడ్డుపై ఉన్న మినీ లారీని జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల అర్బన్ పోలీసులు తనిఖీ చేయడంతో అక్కడున్న నిందితులు పారిపోతుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు దూదేకుల బాషా ఇంటివద్ద తనిఖీలు నిర్వహించారన్నారు. మినీలారీలో చీపుర్ల మధ్యలో ఉన్న 44 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. జగనన్న కాలనీలోని బాషా ఇంటి వద్దకు వెళుతుండగా మరికొందరు మోటారు సైకిళ్లలో తమ సిబ్బందిని చూసి పారిపోయారన్నారు. అక్కడున్న ట్రాక్టరులో 40 ఎర్రచందనం దుంగలు, దూదేకుల బాషా ఇంట్లో 74 దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి దూదేకుల బాషాతో పాటు పింజారి మహ్మద్‌రఫి, అరవోళ్లరఫి, ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన చెల్లుబోయిన శివసాయిలను అరెస్టు చేశామన్నారు. దూదేకుల బాషా, మహ్మద్ రఫి, అరవోళ్లరఫి కర్నూలు జిల్లా పత్తికొండకు చెందినవారైతే జీవనోపాధి నిమిత్తం వచ్చి పోట్లదుర్తిలోని ఇటుకల ఫ్యాక్టరీవద్ద ఉంటున్నారన్నారు. నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4టన్నుల బరువు ఉన్న 158 దుంగలు స్వాధీనం చేసుకున్నామని ఇవి రూ.1.60 కోట్ల విలువ చేస్తాయన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మినీ లారీ, ట్రాక్టరు, బైకు రూ.31 లక్షల విలువ చేస్తాయన్నారు.

ప్రస్తుతం పట్టుబడిన స్మగ్లర్ల సమాచరం మేరకు సిద్దవటం ఫారెస్టులో తనిఖీలు చేపట్టగా పోలీసులను చూసి స్మగ్లర్లు పరారీ అయ్యారన్నారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామని త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారు ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్మగ్లర్లను అరెస్టు చేసి కోట్ల విలువ చేసే దుంగలను స్వాధీనం చేసుకున్న డీఎస్పీ యశ్వంత్, సీఐ ఈశ్వరయ్య, ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, చిరంజీవి, ఎస్‌బీ ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనాలు

కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులు చేపట్టండి

- రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

రాయచోటి టౌన్, జూలై 3: రాయలసీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం 2008-09లో మంజూరు చేసిన కడప-బెంగళూరు నూతన రైల్వేమార్గం పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన రాయచోటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ రైల్వే లైన్లు రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఎంతో అవసరమని, 50 శాతం నిధులు కేంద్రం, 50 శాతం నిధులు రాష్ట్రం భరించే షరతులతో ఈ ప్రాజెక్టు మంజూరైందన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21 కిలోమీటర్లు పూర్తయిందని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వాటా నిధులు ఇవ్వని కారణంగా రైల్వేశాఖ పనులు నిలిపివేసిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన చంద్రబాబు ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులు వెంటనే విడుదల చేసి పనులు తిరిగి ప్రారంభం అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు. కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ అల్లాబకష్ మాట్లాడుతూ కలిసి వచ్చే పార్టీలన్నీ కలుపుకొని భారీ ఎత్తున రైలు మార్గం కొరకు ధర్నాలు, దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చెన్నకృష్ణ, మహమ్మద్‌రఫీ, అజ్మతుల్లా, అమీర్, ఖదీర్, విశ్వనాధరెడ్డి, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మట్కా దందా



- పేద, మధ్యతరగతే టార్గెట్‌గా..
- కొనసాగిస్తున్న మట్కా బీటర్లు
- కొరవడుతున్న పోలీసు నిఘా

కడప (క్రైం), జూలై 3: జిల్లా వ్యాప్తంగా మట్కా రోజురోజుకూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. చిన్న అమౌంటుతో పెద్ద ఎత్తున లెక్క వస్తే తమ ఆర్థిక సమస్యలు తీరడంతో పాటు కుటుంబం కాస్త నిలబెట్టుకోవచ్చని ఉద్దేశ్యంతో చాలా మంది ఈ మట్కా ఉచ్చులో చిక్కుకుపోయి వారి దగ్గర ఉన్న సొమ్ము కోల్పోతున్నారు. కొంతమంది బీటర్లు ఇదే అవకాశంగా తీసుకుని ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేసుకుని వారిని మట్కా ఉచ్చులోకి దించుతున్నారు. ఈ మట్కాఊబిలో ఎక్కువశాతం కూలి పనులు చేసేవారే ఉన్నారు. కూలి పనులతో వచ్చిన డబ్బును మట్కా రూపంతో బీటర్లకు ఇచ్చి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

రూ.10కి వంద అంటూ..

పది రూపాయలు కడితే 100 రూపాయలు వస్తుంది కాబట్టి పోతే 10తోనే నష్టపోతాం. వస్తే వంద లాభం వస్తుందనే ఆశతో మొదట ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. రూ.10కి 100 చొప్పున వందకు వెయ్యి చొప్పున లాభాలు వస్తాయంటూ నిర్వాహకులు చెప్పే మాటలకు అమాయకులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారు వీరి బుట్టలో పడుతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్మును జూదంలో పెట్టడంతో కుటుంబ పోషణ భారమై జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. కొంత మంది అత్యాశకు పోయి మట్కాకు బానిసవుతున్నారు. గతంలో పోలీసుల నిఘా కారణంగా కొన్ని రోజుల పాటు మట్కాకు దూరంగా ఉన్నా నిర్వాహకులు మళ్లీ ప్రాంతాలను మారుస్తూ యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

సెల్ టెక్నాలజీ వాడుకుంటున్నారు

మట్కాబీటర్లు కూడా సెల్ టెక్నాలజీని వాడుకుంటున్నారు. ఒకప్పుడు మట్కా నెంబర్లను చీటీలపై రాసేవారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మట్కా విచ్చలవిడిగా సాగుతోంది. చీటీలతో కాకుండా సెల్‌ఫోన్ల ద్వారా ఈ దందాను కొనసాగిస్తున్నారు. గతంలో కొంత మంది మట్కానెంబర్లు బీటర్లకు చెబితే వారు నోట్ చేసుకోవాల్సి ఉండేది. అలా కాకుండా ప్రస్తుతం నమ్మకం ఉన్న వారికి ఈ మట్కా నెంబర్లను వాట్సప్ మెసేజ్‌ల ద్వారా పంపిస్తూ ఈ దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో మట్కా సాగుతున్నట్లు తెలుస్తోంది. కడప నగరంతో పాటు ప్రొద్దుటూరు జమ్మలమడుగు, మైదుకూరు, రాయచోటి తదితర ప్రాంతాల్లో మట్కానిర్వహణ కొనసాగుతోంది. వీరందరి వద్ద నుంచి బుకీలు డబ్బులు వసూలు చేసుకుని మట్కా నెంబర్లతో పాటు డబ్బులను తాడిపత్రి, గోవా, మహారాష్ట్రలోని ప్రధాన బుకీలకు పంపిస్తారు. డబ్బులు రాకపోయినా అలవాటు పడిన వారు మట్కా వేయకుండా మానడంలేదు.

పోలీసు నిఘా అంతంత మాత్రమే

పోలీసులు ఎన్నికల హడావిడిలో ఉండడంతో కొంత మంది మట్కా బీటర్లు యథేచ్ఛగా ఈ దందా నడిపినట్లు తెలుస్తోంది. కొత్త గవర్నమెంటు వచ్చాక కూడా చాపకింద నీరులా మట్కా దందా కొనసాగుతోంది. పోలీసుస్టేషన్‌లో ఐడీ పార్టీ పోలీసులు ఉన్నా వారు మట్కాబీటర్లపై, ఇతర పాత నేరస్తులపై నిఘా ఉంచడంలో విఫలమవుతున్నారని విమర్శ ఉంది. పోలీసులు ఉక్కుపాదం మోపి మట్కా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై కడప డీఎస్పీ షరీఫ్‌ను వివరణ కోరగా.. మట్కాపై ఇప్పటికే నిఘా ఉంచామని అన్నారు. గతంలో లాగా చీటీలపై కాకుండా మొబైల్ ఫోన్ల ద్వారా మట్కా సాగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై మరింత నిఘా పెడతామని అన్నారు.

'అమూల్'లో డిప్యుటేషన్లు రద్దు

● పర్యవేక్షణ బాధ్యతల నుంచి సహకార సిబ్బంది రిలీవ్

● మరికొన్ని రోజుల్లో మిగిలిన శాఖల్లో..

కడప (ఎన్జీఓస్ సర్కిల్), జూలై 3: మహిళా (అమూల్) పాల డెయిరీ కార్యకలాపాల నుంచి ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమూల్ పాల ఉత్పత్తి సంస్థతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని మహిళా సంఘాల పేరుతో పాల సేకరణకు శ్రీకారం చుట్టారు. జగనన్న పాల వెల్లువ పేరుతో డెయిరీ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వంలో అదొక భాగంగా పరిగణిస్తూ అమూల్ సిబ్బందిని కాదని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బందిని జగనన్న పాల వెల్లువలో బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా పాల సేకరణకు అవసరమైన సామగ్రిని దాదాపు ఒక్కో గ్రామానికి మూడులక్షల రూపాయలు విలువ చేసే పరికరాలను ప్రభుత్వ నిధుల నుంచి వినియోగించినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా పలుచోట్ల పాల కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను కేటాయించడంతో పాటు ప్రజాధనంతోనే నిర్మాణాలు కూడా చేపడుతున్నట్లు సమాచారం. సహకారశాఖలో ఎక్కువ సంఖ్యలో అధికారులను డెయిరీ కార్యకలాపాలకు వినియోగించడం వల్ల వారి సొంత శాఖల పనులకు ఇబ్బందులు ఏర్పడినట్లు తెలుస్తుంది. చాలా సహకారసంఘాల్లో ఆడిట్ల నిర్వహణ ఆలస్యం కావడంతో అక్రమాలకు కూడా ఆస్కారం ఏర్పడినట్లు చర్చ సాగుతోంది.



సహకార సిబ్బంది డిప్యుటేషన్లు రద్దు

ఇప్పటి వరకు జిల్లాలో డెయిరీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు సహకార సిబ్బందిని నియమించారు. డిప్యుటేషన్లు రద్దు చేసి ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి నోటిఫికేషన్ పొందాలని జిల్లా సహకార శాఖ అధికారులను ఆ శాఖ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎ.బాబు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పులివెందుల, లింగాల, చక్రాయపేట తదితర ప్రాంతాల్లో డెయిరీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీటికి అనుగుణంగా ఆయా బల్క్‌మిల్క్ యూనిట్లకు అనుబంధంగా ఉన్న గ్రామాల్లో పాల సేకరణ చేపట్టడం జరుగుతుంది. ప్రస్తుతం రోజుకు 20 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ డెయిరీ కార్యకలాపాలను జగన్ ప్రభుత్వం సహకారశాఖతో పాటు పశు సంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ సిబ్బందితో నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. ప్రభుత్వం మారిన తరుణంలో పలు మార్పులు తీసుకువచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వం అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్లను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం సహకారశాఖ అధికారులు, సిబ్బందిని మాత్రమే డెయిరీ విధుల నుంచి తప్పించారు. మరికొన్ని రోజుల్లో మిగిలిన శాఖలకు సంబంధించి వారిని కూడా తమ శాఖలకు పంపనున్నట్లు తెలుస్తోంది.

సహకార సిబ్బంది రిలీవ్

ఏపీ మహిళా డెయిరీలో చట్టబద్ధంగా పనిచేస్తున్న వారిని మినహాయించి మిగిలిన వారికి సంబంధించిన డిప్యుటేషన్లను రద్దు చేస్తూ జిల్లా సహకారశాఖ అధికారి సుభాషిణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరు సబ్ డివిజన్ కో ఆపరేటివ్ ఆఫీసు నుంచి సీనియర్ ఇన్‌స్పెక్టరు కె.మురళీమోహన్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నందున వీరిని ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాలు అందేంత వరకు కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఇక డిప్యుటేషన్ పద్ధతిలో పనిచేస్తున్న కమాండ్‌కంట్రోల్ ఇన్‌చార్జ్ కమాల్‌తో పాటు రూట్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న సహకారశాఖ అధికారులు సిపీ సుబ్బయ్య, పయాజుద్దీన్, రామక్రిష్ణ, రాజశేఖర్, ఆర్.చెన్న క్రిష్టారెడ్డి, సుభాష్‌చంద్రబోస్, ఎంవీ ప్రభాకర్‌రావు, శ్రీనివాసులు రెడ్డి, బీవీ సుబ్రమణ్యం, మహ్మద్, మురళీమోహన్, ఎం.బ్రహ్మానందరెడ్డి, రఘురామయ్య, బీపీ సుగుణల డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఇక నుంచి డెయిరీ సిబ్బంది పర్యవేక్షణలోనే డెయిరీ నిర్వహణ జరగనున్నట్లు తెలుస్తుంది.

విద్యుత్ బిల్లులు యాప్ ద్వారా చెల్లించాలి

కడప (నాగరాజుపేట), జూలై 3: విద్యుత్ బిల్లులు ఏపీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా చెల్లించాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ బుధవారం పేర్కొన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఇక మీదట ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యుపీఐ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు చెల్లింపులో డిస్కం పేరు కనిపించదన్నారు. కనుక ఏపీఎస్పీడీసీఎల్ కన్స్యూమర్ యాప్‌ని గూగుల్ ప్లే స్టోరు నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, లేదా మా డిస్కం వెబ్‌సైట్ http://www.apspdcl.in నుంచి కానీ బిల్లులు చెల్లించాలని సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ యాప్, లేదా డిస్కం వెబ్‌సైట్‌లో మీరు బిల్లులు చెల్లించేటప్పుడు మీరు మీ ఫోన్‌పే, జీపే, పేటీఎం లేదా ఇతర యూపీఐ యాప్స్‌ని వాడవచ్చు. మీరు డెబిట్, క్రెడిట్, నెట్‌బ్యాంకింగ్, వాలెట్, క్యాష్‌కార్డ్స్ కూడా వాడవచ్చని ఆయన తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కడప (మారుతీనగర్), జూలై 3: ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆదేశాల మేరకు డీఎస్సీ (సెకండ్ గ్రేడ్ టీచర్స్) పరీక్షలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను 10వ తేదీ లోపు స్వీకరిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అధ్యాయన కేంద్రం (ఏపీ బీసీ స్టడీ సర్కిల్) కడప ఉమ్మడి జిల్లా సంచాలకులు డాక్టర్ వి.బ్రహ్మయ్య తెలిపారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండి టీటీసీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా (బీసీ 66శాతం, ఎస్సీ 20శాతం, ఎస్టీ 14శాతం) ఎంపిక చేస్తామన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. శిక్షణ కాలం 60 రోజులుగా నిర్ధారించారన్నారు. ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్, స్టైపండ్ ఇస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా, ఎస్ఎస్‌సి, ఇంటర్, టీటీసీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డ్, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు జతపరచి పాత కలెక్టరేట్‌లోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 10వ తేదీ లోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9849919221, 9703185382 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

రైలుకింద పడి ఏఎస్ఐ ఆత్మహత్య



వల్లూరు, జూలై 3: మండల పరిధిలోని తప్పెట్ల రైల్వేబ్రిడ్జి వద్ద ఏఎస్ఐ బసిరెడ్డి నాగార్జునరెడ్డి (58) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కమలాపురం పోలీసు స్టేషన్‌లో నాగార్జునరెడ్డి ఏఎస్ఐగా విధులు నిర్వహించేవారు. మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు విధులు ముగించుకుని కడపకు తన ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యలోని తప్పెట్ల వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పక్కన బెట్టి రైల్వేబ్రిడ్జి కిందకు వెళ్లి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆత్మహత్యకు అనారోగ్య కారణాలు ఉండవచ్చని తెలిపారు. నాగార్జునరెడ్డి స్వగ్రామం దేవునికడప మోడమీదపల్లె అని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మల్లికార్జునరెడ్డి (ఫైల్)

పెండ్లిమర్రి, జూలై 3: మండలంలోని పాత సంగటిపల్లె గ్రామానికి చెందిన బాలయ్యగారి మల్లికార్జునరెడ్డి (34) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పాతసంగటిపల్లెకు చెందిన గంగమ్మ, వెంకటసుబ్బారెడ్డి కుమారుడు మల్లికార్జునరెడ్డి. ఇతను తన తల్లి, తమ్ముడు ముగ్గురు కలసి వెల్లటూరు పెట్రోల్ బంకు పక్కన హోటల్ నిర్వహిస్తున్నారు. ఇతనికి చుట్టుపక్కల ప్రాంతాల్లో మంచి సౌమ్యుడిగా పేరుంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట మల్లికార్జునరెడ్డి ఇంటి వద్దనుంచి మోటార్ సైకిల్‌పై వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం వెతుకుతుండగా వెయ్యినూతులకోన అటవీప్రాంతంలో ఉరివేసుకుని విగత జీవుడై కనిపించాడని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, మల్లికార్జునరెడ్డి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఓబులవారిపల్లె, జూలై 3: మండల పరిధిలోని ముదినేపల్లె దళితవాడ గ్రామానికి చెందిన కొప్పల నరసింహులుపై 2004లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష ఖరారైనట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే... ముదినేపల్లె దళితవాడకు చెందిన కొప్పల నరసింహులుపై 2004లో హత్యాయత్నానికి ప్రయత్నించినట్లు ఐదుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది. అందుకు సంబంధించి విచారణ చేసి ముద్దాయిలను రిమాండ్‌కు పంపారు. 2006లో కేసుకు సంబంధించి ఎ-4, ఎ-5 ముద్దాయిలుగా ఉన్న కొప్పల రమణ, కొప్పల అంకయ్యలకు రాజంపేట కోర్టులో మూడేళ్ల జైలుశిక్ష విధించగా వారు హైకోర్టుకు వెళ్లారు. అయితే హైకోర్టు కూడా కింద కోర్టు వేసిన శిక్షనే ఖరారు చేయడం జరిగింది. సదరు వ్యక్తులను తిరిగి రాజంపేట కోర్టులో హాజరుపరచగా జడ్జి 4 సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. కోర్టు కానిస్టేబుల్ మల్లికార్జున, హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌వల్లి, కానిస్టేబుల్ కార్తీక్‌లు కోర్టు ఉత్తర్వులు అమలు చేసినట్లు తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

వేంపల్లె, జూలై 3: వేంపల్లె ప్రియాతోటకు చెందిన స్వామినాథన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. మంగళవారం రాత్రి వివాహేతర సంబంధం వ్యవహారంలో మస్తాన్‌పై స్వామినాథన్ కత్తితో దాడి చేశారు. మస్తాన్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మస్తాన్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ రిజిస్ట్రారుపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో అవుట్ సోర్సింగ్ నియామకాలలో అక్రమాలకు పాల్పడిన మాజీ రిజిస్ట్రారు వీసీ సురేంద్రనాదరెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం వైవీయూ మెయిన్‌గేటు ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్న మాజీ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రారు వీసీ సురేంద్రనాధరెడ్డిని కలిసి అవుట్ సోర్సింగ్ నియమాకాల్లో ఎటువంటి నోటిఫికేషన్, రోస్టర్ పద్ధతి లేకుండా 130 నాన్‌టీచింగ్ పోస్టులు నియమించి నిరుద్యోగులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు త్రినాదయాదవ్, విఘ్నేష్ రమణపాల్గొన్నారు.

ఎన్‌సీసీ బెటాలియన్ తరలించే ప్రయత్నాలు మానుకోండి

● ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అశోక్



ధర్నాలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అశోక్

కడప (మారుతీనగర్) జూలై 3: కడపలోని ఎన్‌సీసీ బెటాలియన్‌ను ఉన్నఫలంగా తిరుపతికి తరలించాలనే ప్రయత్నాలను తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు విరమించుకోవాలని ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అశోక్ స్పష్టం చేశారు. ఇందుకు నిరసనగా పలువురు డిగ్రీ కళాశాలల, పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థినీ, విద్యార్థులు బుధవారం కడప రైల్వేస్టేషన్ సమీప 30(ఎ) బీఎన్ ఎన్‌సీసీ కడప కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ మాతృ దేశ సేవలో తరించాలనే లక్ష్యంతో ఎన్‌సీసీలో పలువురు విద్యార్థులు చేరి స్వచ్ఛం దంగా వివిధ సేవలందిస్తున్న సంగతి తెలిసిందే అన్నారు. గత కొన్నేళ్లుగా కడప నగర సమీపంలోని మామిళ్లపల్లె తెలుగుగంగ క్వార్టర్స్ సమీపంలో ఉన్న ఎన్‌సీసీ బెటాలియన్‌ను తిరుపతికి తరలించాలనుకోవడం సరైందికాదన్నారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా మారుతుందన్నారు. తిరుపతి గ్రూప్‌లోని అన్ని బెటాలియన్‌లలో ఏ,బీ,సీ సర్టిఫికెట్ల రిజల్ట్స్ వదిలినప్పటికీ.. కడప బెటాలి యన్‌లో రిజల్ట్స్‌ను తొక్కిపెట్టడం దారుణమన్నారు. ముఖ్యంగా 2023-24 సంబంధించి ఎన్‌రోల్‌మెంట్‌ను త్వరితగతిన కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాదు, కూడదని తిరుపతికి తరలించాలని మొండికేస్తే జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలు, పాఠశాలల్లో గల ఎన్‌సీసీ విద్యార్థులను ఏకం చేసి పోరు సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ డిగ్రీ కళాశా లల, విద్యార్థుల ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌సీసీ క్యాడెట్ సోలోమెన్ మునివర్ధన్, కాశి, శివారాణి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాలపై సమీక్ష జరగాలి



ఇన్‌చార్జి కలెక్టర్‌తో మాట్లాడుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, జూలై 3: పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ జరపకుండానే కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై తిరిగి సమీక్ష జరపాలని... అంతవరకు చట్టాల అమలు చేయడం ఆపివేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాయచోటి బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, సహాయ కార్యదర్శి డి.నాగముని నేతృత్వంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలియజేశారు. అంతకుముందు రాయచోటిలోని కోర్టు విధులను వారు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులు తమకు అన్యాయం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులను అదుపులోకి తీసుకొని కేసును విచారణ జరపాలన్నారు. కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే జరిగిన సంఘటనపై పోలీసులు ప్రాథమిక విచారణ చేసిన తర్వాత ఎఫ్ఐఆర్ చేయవచ్చునని నిబంధన పెట్టడం బాధితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీంతో పోలీసులకు అపరిమిత అధికారాలు వచ్చి ఇష్టం వచ్చినట్లు చేసే అవకాశం ఉందన్నారు. రిమాండ్‌కు తరలించిన తర్వాత 15 రోజుల్లోగా ముద్దాయిలను పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఇప్పటి వరకు ఉండగా నూతన చట్టాలతో 90 రోజుల వరకు పోలీసులు కస్టడీలోకి తీసుకొనే అధికారం పోలీసులకు ఇవ్వడం దారుణమన్నారు. ఈ నిబంధనతో చాలా కాలం వరకు ముద్దాయిలు జైల్లో మగ్గాల్సి వస్తుందన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను గానీ భారత రాజ్యాంగాన్ని గానీ ఏ మాత్రం పట్టించుకోకుండా.. ఎవరితోనూ చర్చించకుండా తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై సమీక్ష జరిగేంతవరకు ప్రజలందరూ ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు ధనుంజయ్‌కుమార్, చిన్నయ్య, ఆనంద్‌కుమార్, హుమయూన్‌బాషా, రవిశంకర్, ఖాదర్‌బాషా, నిరంజన్, ఖిజరలి, ఉత్తేజ్‌కుమార్, చంద్రశేఖర్, నాగాంజనేయులు పాల్గొన్నారు.

నా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారు

● ఎస్పీకి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



పోలీసులు, పెద్దల సమక్షంలో భూమిని కొలుస్తున్న సర్వేయర్

చక్రాయపేట, జూలై 3: నా భూమిని కొంతమంది దౌర్జన్యగా ఆక్రమించుకున్నారని కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశాను. వారు కింది స్థాయి అధికారులకు ఆదేశించినా పట్టించుకోవడం లేదని ఆనందరెడ్డి అనే రైతు విలపించాడు. వివరాల్లోకెళితే... గడ్డంవారిపల్లె గ్రామం గొందిపల్లె సమీపంలో కనం వద్ద 985 సర్వే నెంబర్‌లో సరస్వతికి 1.80 ఎకరాలు, ఆనందరెడ్డికి ఒక ఎకరా భూమి ఉంది. ఆ భూమిని వనంలోపల్లెకు చెందిన వారు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆరు నెలల క్రితం అప్పటి తహసీల్దార్ రాజసింహనరేంద్రకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సర్వేయర్‌ను పిలిపించి భూమి ఆనందరెడ్డిదే అని చెప్పి రాళ్లు నాటించాడు. అనంతరం ఈ రాళ్లను దౌర్జన్యంగా తీసేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మళ్లీ సర్వే చేయించి న్యాయం చేస్తామని చెప్పి.. సర్వే చేయించి రాళ్లు నాటించాడు. అయితే మళ్లీ రాళ్లు పీకేశారు. ఈ విషయం ఎస్ఐకి చెప్పినా పట్టించు కోలేదు. దీంతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో.. తహసీల్దార్, ఎస్ఐలను న్యాయం చేయాలని ఆదేశించారు. కానీ ఎస్ఐ మళ్లీ బుధవారం సర్వే చేయిస్తుండగా ప్రత్యర్థులు దౌర్జన్యంగా భూమిని కొలవకుండా అడ్డుకున్నారు. పోలీసుల సమక్షంలోనే జరుగుతున్నా పట్టించుకోలేదు. నేను టీడీపీ కార్యకర్తను అని.. నన్ను చాలా ఇబ్బందులు పెట్టారని.. ప్రస్తుతం ప్రభుత్వం మారింది.. ఇప్పటికైనా న్యాయం చేయాలని బాధిత రైతు ఆనందరెడ్డి కోరుతున్నారు. లేదంటే ఆత్మహత్యే శరణ్యమని విలపించాడు. ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా.. సర్వేయర్ రిపోర్టు ఇస్తే చర్యలు తీసుకుంటానని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ప్రత్యేక కేటగిరిలో మూడో రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్



దివ్యాంగులకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

నూజివీడు టౌన్, జూలై 3: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు మూడో రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు జిల్లా నూజివీడు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైనిక సంతతి విభాగానికి చెందిన 57 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 49, ఎన్‌సీసీ విభాగంలో 101 మంది, క్రీడా విభాగంలో 180, దివ్యాంగుల విభాగంలో 248 మంది మొత్తం 579 విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

ప్రారంభమైన వైవీయూ సర్టిఫికెట్‌కోర్సుల పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: వైవీయూ లలిత కళల విభాగం నిర్వహిస్తున్న నృత్యం, కీబోర్డు, కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సులకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు అందరికీ అందుబాటులో ఉండేలా శ్రీహరి డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. సుమారు వంద మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ విభాగం అధిపతి డాక్టర్ కె.మృత్యుంజయరావు పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాధరెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదోక కళను అభ్యశించాలని తద్వారా అది మనిషిని సంస్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీహరి డిగ్రీకాలేజీ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, వైవీయూ పీఆర్‌వో ఎస్వీ సుబ్బారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పోటాపోటీగా వేంపల్లె మార్కెట్ వేలం

● పంచాయతీకి రూ.40.30 లక్షలు ఆదాయం

వేంపల్లె, జూన్ 3: వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్‌లో వ్యాపార సముదాయంలో పన్ను వసూలు చేసుకునే హక్కు కోసం వేలం పోటాపోటీగా జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం డీఎల్పీఓ రమాదేవి, సర్పంచు ఆర్.శ్రీనివాసులు, ఈఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గత సంవత్సరం 12నెలలకు రూ.33లక్షలు వేలం పాడగా ఈ ఏడాది తొమ్మిది నెలల కాలానికి రూ.40.30లక్షలతో కుప్పాలపల్లె రామగంగిరెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.


మేనేజర్ - ఏడివిటి

వివాదాస్పదంగా మారిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ

● మొదటి భార్య సంతానం ఉన్నా... లేనట్లుగా ధ్రువీకరణ

● నందిమండలం గ్రామ రెవెన్యూ అధికారి తీరిది

పెండ్లిమర్రి, జూలై 3: నందిమండలం గ్రామంలో వీఆర్వో తీరు వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకెళితే... మొదటి భార్య సంతానం ఉండగానే రెండో భార్యకు మాత్రమే సంతానం ఉందని ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడం వివాదాలకు దారితీస్తోంది. నందిమండలం వాసి షేక్ వడ్ల మహబూబ్ సాహెబ్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మస్తాన్‌బీకి బాబావాజిద్ అనే కుమారుడు ఉన్నారు. రెండో భార్య హుస్సేన్‌బీకి ఖాదర్‌బాష అనే కుమారుడు, మహబూబ్‌చాన్ అనే కుమార్తె ఉంది. అయితే మొదటి భార్య కొడుకు బాబావాజిద్ వృత్తిరీత్యా సౌదీలో ఉన్నాడు. తండ్రి ఆస్తిని కాజేసేందుకు రెండో భార్య కుమారుడు ఖాదర్‌బాష వీఆర్వోను సంప్రదించాడు. వీఆర్వో అందుకు సహకరించి ఈ ఏడాది జనవరి 20వ తేదీ మొదటి భార్య కుమారుడు లేకుండానే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను జారీ చేశాడు. అంతా సవ్యంగా సక్రమంగా ఉంటేనే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకునే అధికారులు ఇలా డబ్బుకు ఆశపడి సర్టిఫికెట్ జారీచేయడం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడం అంటే ఆర్ఐ విచారించి ఆ వివరాలు తహసీల్దార్‌కు తెలియపరచాలి. అయితే ఇక్కడ మాత్రం డబ్బు చేతులు మారడంతో ఎలాంటి విచారణ చేయకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చారని దుమారం లేపుతోంది. మొదటి భార్య కొడుకు బాబావాజిద్ ప్రస్తుత తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు ఫిర్యాదు చేయడంతో ఈ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ప్రస్తుత తహసీల్దార్ మాట్లాడుతూ సర్టిఫికెట్ జారీ చేసిన మాట వాస్తవమేనని, విచారణకు ఆదేశించామని, ఈ సర్టిఫికెట్‌పై రీఒకేషన్ కోరుతూ జేసీకి పంపినట్లు తెలిపారు. ఈసర్టిఫికెట్ ఆధారంగానే రూ.50లక్షలు విలువ చేసే స్థలాన్ని ఖాదర్‌బాష అమ్మినట్లు బాబా వాజిద్ తెలిపారు. తనకు తమ్ముడైన ఖాదర్‌బాష అందుకు సహకరించిన వీఆర్వోపై పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.



REVENUE DEPARTMENT

...C.Chandra Sekhar Varma.,M.Sc
...hsildar,
...ndimarri Mandal

To
The Joint Collector,
Y.S.R.District
Kadapa.

Ref.No.A/04/2024, Dated: 17.05.2024

Sub:- Family Member Certificate - Nandimandalam Village - Pendlimarri Mandal - A/o Sri S.Vadla Husian W/o V.Mabu - FAMC240123046985 - Approved on Dated: 25.01.2024.- Objection filed by Sri S.Vadla Baba Vazad - Revocation of FMC - Requested -Regarding.

Ref.No.1. Application of S.Vadla Baba Vazeed of Nandimandalam Village of Pendlimarri Mandal, Dated: 26.04.2024.

******

I invite kind attention to the Reference Cited.

I submit that Sri Shaik Vadla Baba Vazeed S/o Mabu Sab, the first wife son of late Vadla Mabu Saheb has applied for issue of F.M.C. requesting to cancel the F.M.C issued earlier suppressing the facts that his aunty (Second Wife of his father) has obtained the FM.Cwithout mentioning his name.

I therefore, request to revoke the application bearing No. FMC240123046985 issued to Smt. S.Vadla Husian Bi for taking further action in the matter.

ప్రస్తుత తహసీల్దార్ రీఒకేషన్ కోరుతూ జేసీకి పంపిన సర్టిఫికెట్


సొంత జిల్లాలో వైద్యరంగాన్ని పట్టించుకోని మాజీ సీఎం



సర్వజన ఆస్పత్రిలో సమస్యలు పరిశీలిస్తున్న రవిశంకర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 3: సొంత జిల్లాలో వైద్యరంగాన్ని గాలికి వదిలేశారని రాయలసీమ కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాజీ సీఎం జగన్‌పై విరుచుకు పడ్డారు. బుధవారం సర్వజన ఆస్పత్రిలో సభ్యులతో కలిసి పర్యటించిన ఆయన మాట్లాడుతూ తండ్రికి తలమానికంగా నిలిచిన, జిల్లాకే తలమానికమైన సర్వజన ఆస్పత్రిలో లెక్కలేనన్ని సమస్యలున్నా జగన్ రెడ్డి పట్టించుకోక పోవడం దారుణమన్నారు. గత పాలకులు ఎంతో ఆర్భాటంగా నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ తాళాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. సిబ్బంది, వైద్యపరికరాలు లేకుండా భవనాలు నిర్మిస్తేనే సూపర్‌స్పెషాలిటీ అవుతుందా అని ఆయన ప్రశ్నించారు. ఓపీలోని ఎక్స్‌రే సిటిస్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ విభాగాల్లో ఆరు ఏసీలు ఉంటే ఒక్కటి కూడా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాజువాలిటీ రోగులకు ఏ మాత్రం సరిపోవడం లేదని, మరుగుదొడ్లలో నిరంతరం నీరు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. రోగులను పరామర్శించడానికి వచ్చే కుటుంబీకులకు కుర్చీలు లేవని, రోగులను తీసుకెళ్లడానికి వీల్‌చైర్స్, స్ట్రెక్చర్ వంటి సాధనాలు కరువయ్యాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తస్లీం, లక్ష్మిదేవి, నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాద్, చెన్నయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కడప ఎంఈఓగా గంగిరెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: కడప ఎంఈఓ-1గా గంగిరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. చెన్నూరు ఎంఈఓగా ఉంటూ కడప ఎంఈఓ అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు. గతంలో వివిధ మండలాల్లో ఎంఈఓగా పనిచేయడం, సమగ్ర శిక్ష అభియాన్‌లో సీఎంఓగా కూడా విధులు నిర్వహించారు. గంగిరెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల అన్నియాజమాన్యాల సమన్వయంతో మండలాన్ని అన్ని విభాగాల్లో ముందుండేలా కృషి చేస్తామని, ఇందుకు అంతా సహకరించాలని కోరారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మానం

కడప ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన గంగిరెడ్డికి ఎస్టీయూ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ2 ఇర్షాద్ అహ్మద్, జిల్లా అధ్యక్షులు ఇలియాస్‌బాషా, సాదిక్‌అలీ,సంజీవరాయుడు, అస్లాం తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం

ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

కడప (మారుతీనగర్) జూలై 3: ఆర్టీసీలో ఐదేళ్లగా అపరిష్కృతంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్ఎంయూ కార్యాలయంలో రీజనల్ స్థాయి సమావేశానికి ముందుగా పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలో సైతం ఏ సమస్యా సంబంధిత రీజనల్ మేనేజర్ పరిష్కరించకపోగా మరింత జటిలం చేస్తున్నారని ఆరోపించారు. చిన్న చిన్న సమస్యలకు కూడా ఉద్యోగులను బదిలీలు, సస్పెండ్ చేయడం పనిగా పెట్టుకున్నారని విచారం వ్యక్తం చేశారు. సస్పెండ్‌కు గురైన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోకుండా సుమారు ఏడాదిన్నరగా డిపో స్పేర్‌లో వుంచి డ్యూటీలకు పంపించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం తప్ప సమస్యలను పరిష్కరించడంలో ఏ మాత్రం దృష్టిసారించడం లేదన్నారు. జిల్లాలోని ఆరు డిపోల మేనేజర్లు తప్పులమీద తప్పులు చేస్తున్నా రీజనల్ మేనేజర్ మౌన ముద్ర వహించడం సరికాదన్నారు. ముఖ్యంగా కడప డిపోలో కండక్టర్ల ఫిక్స్‌డ్ చార్ట్ మాత్రమే వేసి డ్రైవర్ల తాలూకు ఫిక్స్‌డ్ చార్ట్ వేయకుండా తాత్సారం చేయడం విడ్డూరంగా వుందన్నారు. సస్పెండ్ చేయడంలో చూపే శ్రద్ధ ఉద్యోగుల ఇంక్రిమెంట్స్ కలపడంలో, అవసరాలకు లీవ్‌లు మంజూరు చేయడంలో అస్సలు చూపడం లేదన్నారు. బస్సుల కండీషన్ అధ్వాన్నంగా వున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బస్సుల స్వీపింగ్, వాషింగ్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేదిశగా పనిచేయాలన్నారు. లేని పక్షంలో పోరుకు సన్నద్ధం కానున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో ఎన్ఎంయూ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగముని, సుధాకర్, నేతలు సగినాల శ్రీనివాసులు, తొండలదిన్నె జయరామ్, పలువురు నేతలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సునీత

వేంపల్లె, జూలై 3: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలని అధికారులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో కొత్త చట్టాలపై అవగాహన చేపట్టగా సీడీపీఓ సునీత, ఐసీపీస్ వింగ్ లీగల్ కౌన్సిలర్ సునీతరాజు, సీఐ చాంద్‌బాష, ఎంపీడీఓ సంపతి దివిజ, తహసీల్దార్ నాయక్ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాల పట్ల అవాహన కల్పించేందుకు వీలుగా అంగన్వాడీలు, మహిళా పోలీసులు కొత్త చట్టాలపై అవాహన కలిగి ఉండాలని కోరారు. భారతీయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం చట్టాలు అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. కొత్త నేర చట్టాలపై అవాహన పెంచేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెలుగు ఏపీఎం బాలస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, నాగరత్న, సుభద్ర, నాగసుభాషిణి, హసీన, చక్రాయపేట, వేముల, వేంపల్లె అంగన్వాడీలు పాల్గొన్నారు.

మట్టి తరలింపు ఆపకుంటే ధర్నాచేస్తాం

వీరపునాయునిపల్లె,జూలై 3: ఇందుకూరు పంచాయతీలో కొండలు,గుట్టలు తవ్వి మట్టిని తరలిస్తున్నారని, ఆపకుంటే గ్రామస్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఏపీ రైతు సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, పశువులను గడ్డి మేపేందుకు కాపరులు కొండలు, గుట్టలకు తీసుకొస్తుంటారన్నారు. ఈ మట్టి తవ్వకాల వలన వాటికి మేపు లేకుండా పోతోందన్నారు. ఇందుకూరు అయ్యవారిపల్లె, కొత్తపల్లె, గడ్డంవారిపల్లె, పోచంరెడ్డిపల్లె, సంగాలపల్లె, కొమ్మద్ది, అడిచెర్లోపల్లె, బుసిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని పశువులు, మేకలు, గొర్రెలకు గడ్డి మేపుకొనేందుకు అనువుగా ఉంటుందన్నారు. మట్టిని తరలించడంతో గడ్డికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే గ్రామస్తులతో కలిసి ధర్నాచేస్తామని ఆయన హెచ్చరించారు.

పరిసరాల శుభ్రతతో అంటువ్యాధులు దూరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు దూరం చేయవచ్చని ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. బుధవారం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన చేపట్టిన ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎంహెచ్ఓ క్లస్టరు అధికారి భాస్కర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం ద్వారా దోమలు అధికమై మలేరియా, గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. వీటిలో డెంగ్యూ మలేరియా దోమకాటుతో వస్తుందని, ఇంటి పరిసరాలు మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ శచీదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, వాహిదా, రిజ్వానా, మీనాకుమారి పాల్గొన్నారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్, జూన్ 3: తొండూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో సీట్లకు దరకాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. తొండూరు ఐటీఐలో సీట్లు పొందేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. టెన్త్ పాసైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటో, ఆధార్, కుల ధృవీకరణ పత్రాలతో వస్తే ఉచితంగా నమోదుచేస్తామన్నారు. 24వ తేదీ ఆఖరు గడువన్నారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని జనసేన నేత తుంగా రమణయ్య టీడీపీ నేత గొంటుముక్కల చినబాబు తెలిపారు. బుధవారం కడప నగరం 7వడివిజన్ శంకరాపురం సచివాలయాల్లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రం అథోగతి పాలైందని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ద్వారా రాష్ట్రాన్ని చక్కదిద్దే పనిలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే అది కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి, వంశీ యాదవ్, తుంగా కిరణ్, మధు, బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణాన్ని కాపాడుదాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి



తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న శశిభూషణ్‌రెడ్డి తదితరులు

సింహాద్రిపురం, జూలై 3: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం తహసీల్దార్ కార్యాలయంలో బుదవారం బీజేపీ నేతలు, తహసీల్దార్ భీమేశ్వర్‌రావుతో కలసి మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలోని బుద్ధ జయంతి పార్కులో ఒక రావి మొక్క నాటి అమ్మ కోసం ఒక్క చెట్టు (ఏక్ పైడ్ మాకే నామ్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాని పిలుపు మేరకు బీజేపీ జాతీయ స్థాయి నుంచి నేతలు, కార్యకర్తలు సహా ప్రతి ఒక్కరూ 'ఒక చెట్టు అమ్మ కోసం'లో పాల్గొని విరివిగా మొక్కలు నాటాలన్నారు. బీజేపీ నేతలు లక్ష్మినారాయణరెడ్డి, శ్రీనివాస రెడ్డి, అమర్‌నాథరెడ్డి, వెంకటరమణారెడ్డి, ద్వారకనాథరెడ్డి, నల్లయ్య, ఓంప్రకాష్, కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందన వెల్లువ



ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డిని సన్మానిస్తున్న కెమిస్ట్ అండ్‌డ్రగ్గిస్ట్ సభ్యులు

కమలాపురం రూరల్, జూలై 3: కమలాపురం ఎమ్మెల్యేగా గెలుపొందిన పుత్తా చైతన్యరెడ్డికి అభినందనలు వెల్లువ కొనసాగుతోంది. ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచీ ప్రతి డిపార్ట్‌మెంటు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బుధవారం కమలాపురం మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు మాచిరెడ్డిపల్లెలోని స్వగృహంలో ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని కలిసి పూలమాలతో, దుశ్శాలువాతో సత్కరించారు. అసోసి యేషన్ మండల అధ్యక్షుడు రెడ్డి సురేశ్, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, దాదాజహీర్, అంబటి సునీల్, వెంకట సుబ్బయ్య, మల్లి, ఇస్మాయిల్, సునీల్‌కుమార్‌రెడ్డి, సుధీర్, గంగాధర్రెడ్డి పాల్గొన్నారు.

బాలికల కళాశాలకు రూ.50వేలు వితరణ

స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి రూ.50వేలు వితరణగా కళాశాల సిబ్బందికి అందించారు. సోమవారం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాకిట్లు పంపిణీలో ఆయన ఇచ్చిన మాట ప్రకారం ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని వితరణ అందించారు. దీంతో కళాశాల బాలికలు సిబ్బంది, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

202 బస్తాల చౌక బియ్యం పట్టివేత



బస్తాలను సీజ్ చేస్తున్న సీఐ

చెన్నూరు, జూలై 3: శివాలపల్లె రోడ్డు వద్ద ఓ ఇంట్లో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 202 చౌక బియ్యం బస్తాలను సీఐ నారాయణ యాదవ్ పట్టుకున్నారు. బియ్యం అక్రమ రవాణాకు వినియోగించే ఓఆటోను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశిల్ ఆదేశాల మేరకు ఇటీవల చౌక బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. బుధవారం రాత్రి శివాలపల్లె నుంచి బియ్యం బస్తాలు తరలిస్తున్న విషయం తెలియడంతో సిబ్బందితో దాడి చేసి బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో 35 కిలోలున్న బియ్యం ఉన్న బ్యాగులు 122, 48 కిలోల బియ్యం బస్తాలు 80 ఉన్నాయన్నారు. చెన్నూరు వాసి బ్రహ్మయ్య, ఆటో డ్రైవరు సుబ్బయ్యపై కేసు నమోదు చేశామన్నారు. దాడిలో శివయ్య, శ్రీనివాస రాజు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బంద్ విజయవంతం చేయాలి

ఏఐఎస్ఎఫ్, ఆర్ఎస్ఓ, పీఎస్‌వైఎఫ్



పోస్టరు విడుదల చేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: నీట్ పరీక్ష ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి సంఘాల పిలుపుతో దేశ వ్యాప్తంగా విద్యసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం గాయత్రీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జగదీశ్ ఆధ్వర్యంలో బంద్ పోస్టరును విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 65 సార్లు పేపర్లు లీక్ అయ్యాయన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతకవకలు కారణంగా దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన బంద్ విజయవంతం చేయాలని విద్యాసంస్థలన్నీ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చిన ఓబులేసు, ప్రేమ్‌నాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లెమాల సేవలు ప్రశంసనీయం

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 3: వైద్యుడు, సాహిత్యకారుడు, సంఘ సేవకుడు, ఆధ్యాత్మిక సంస్థల సంచాలకులుగా డాక్టర్ మల్లెమాల వేణుగోపాలరెడ్డి సేవలు ప్రశంసనీయమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జనార్ధనరావు ఆధ్వర్యంలో మల్లెమాల సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో జనార్ధన రాజు, వెంకటేశ్వరచారి మూల అయ్యవారురెడ్డి, డేవిడ్, విజయ్, సతీష్, పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసి ఆర్‌సీడీఎస్ ప్రతినిధులు

పులివెందుల టౌన్, జూలై 3: ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు అరవిందనాథ్‌రెడ్డి బుధవారం కలిశారు. మొట్టమొదటి స్వతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసిహారెడ్డి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అమలుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వేంపల్లె, జూలై 3: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అమలుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమార్ స్వామి గుప్త తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఎస్సీఎస్టీ కమిటీ మొదటి సమావేశం జరిగింది. పలు విషయాలు చర్చించారు. ఏఓ రవికుమార్, డీన్ రత్నకుమారి, ఎస్సీ, ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ కల్యాణ్ చక్రవర్తి, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి



మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి

వేంపల్లె,జూలై 2: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని టీడీపీ మండల పరిశీలకులు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి సూచించారు. గాంధీరోడ్డులో పాత స్టేట్‌బ్యాంకు సమీపంలో పంచాయతీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రఘునాథరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గోటూరు నాగభూషణం, సుబ్బరాయుడు, నామా వేమకుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ప్రమాదాన్ని గుర్తించాలి

పులివెందుల రూరల్, జూలై 3: ప్లాస్టిక్ వలన ఇప్పటికే భూమికి, మానవాళికి, పర్యావరణానికి జరిగిన ప్రమాదాన్ని గుర్తించాలని ఎంఈఓ-2 రామానాయుడు అన్నారు. జిల్లాపరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన చేపట్టిన ఆయన మాట్లాడుతూ వాతావరణంలో ప్రమాదకర మార్పులు చోటు చేసుకుంటున్నాయని, భూతాపం పెరిగిపోతోందని, వర్షాలు కూడా సక్రమంగా పడకపోవడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయన్నారు. పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే హానికరమైన పరిణామాలపై ప్రజలు తెలుసుకోవాలన్నారు.



శాసనసభ్యుల కోటాలో టీడీపీ ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన సి.రామచంద్రయ్యను కడప స్వగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, కుప్పాల వెంకటసుబ్బయ్య, మాజీ కార్పొరేటరు టీడీపీ నేత బండిబాబు, బీజేపీ నేత చలపతి, టీడీపీ నేతలు సత్య, జగన్నాథరావు, చలపతి, శ్రీనివాస విద్యాసంస్థల చైర్మన్ టింబర్ డిపో శ్రీనివాసులు వేర్వేరుగా కలిసి సత్కరించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రొద్దుటూరు క్రైం, జూలై 3 : పట్టణ పరిధిలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేరులతో మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వీటితో పాటు మట్కాకు పాల్పడితే కూడా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన తెలిపారు.

స్వీపర్ల వేతనాలలో కోత విధింపు దారుణం

జమ్మలమడుగు, జూలై 3: జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న స్వీపర్లకు వేతనాలలో కోత విధించడం దారుణమని సీఐటీయూ పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ తెలిపారు. ఈమేరకు బుధవారం డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మాట్లాడుతూ స్వీపర్లకు రూ.11,200 వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.9,100 ఇచ్చి మిగతా సొమ్ము దోచుకుంటున్నారన్నారు. అలాగే మరో మూడు వేలు వెనక్కు తీసుకుంటున్నట్లు వారు విమర్శించారు. కాంట్రాక్టర్‌ను విచారణ జరిపి వెంటనే కాంట్రాక్టు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షుడు ఆదాం, దివాకర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సర్వే

ముద్దనూరు జూలై3: ముద్దనూరు టౌన్‌లో రోడ్డు విస్తరణ కోసం బుధవారం ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు.నాలుగు రోడ్డు కూడలి నుంచి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల వరకు ఒక కిలోమీటరు దూరం పనులు చేపడుతున్నట్లు ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రరెడ్డి తెలిపారు.ప్రస్తుతం ఉన్న రోడ్డు 7మీటర్లు పోను రోడ్డుకు ఇరువైపుల 5 మీటర్లు చొప్పున విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు.రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ ఏర్పాటు చేయనునన్నట్లు,త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపడతామని తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలి

జమ్మలమడుగు, జూలై 3: ఈనెల 4వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌ను యాజమాన్యాలు సహకరించి జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. బుధవారం జమ్మలమడుగులోని అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలకు బంద్‌కు సంబంధించి నోటీసు పత్రాలు అందించారు. నీట్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ దేశవ్యాప్తంగా గురువారం విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

ఎర్రగుంట్ల, జూలై 3:ఎర్రగుంట్ల మండలంలోని మాలేపాడు గ్రామంలో జిల్లా పశుగణాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశవ్యాధుల చికిత్సలు, సాధారణ పశువ్యాధుల చికిత్సలు చేశారు. అలాగే గొర్రెలకు, మేకలకు, దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారులు రమేష్ ఈవో డీఎల్‌డీవో, ఏడీ బి.మునెయ్య, బి.శివరామిరెడ్డి, జ్యోతి, ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లెకు చెందిన పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పోరుమామిళ్ల, జూలై 3 : సంవర్ధిని అఖిలభారత ట్రస్టు ఆధ్వర్యంలో మిట్టా లక్ష్మి పద్మ సహాయంతో బుడ్గజంగాల కాలనీలోని పేద పిల్లలకు పుస్తకాలు, పెన్నులు విద్యాసామగ్రిని ఉచితంగా అందించారు. బుధవారం ట్రస్టు కార్యకర్తలు గంటా గురులక్ష్మి, ఉమాదేవి, లక్ష్మి పద్మ, భాగ్యలక్ష్మి, రమణకుమారి, చెన్నయ్య, రామక్రిష్ణరెడ్డి, చెన్నక్రిష్ణయ్య తదితరులు వారి నివాసం ఉన్న ప్రాంతానికి వెళ్లి వారికి విద్యాసామగ్రి అందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పల్లకి సేవలో శ్రీనివాసుడు



బద్వేలు, జూలై 3:పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వేంకటేశ్వర స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం 6.30 గంటలకు చతుర్థనార్చన లక్ష్మి హయగ్రీవ హోమం, వేద స్వస్తి, తీర్థ ప్రసాద వినియోగంతో పాటు సాయంత్రం తిరుచ్చి వాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

నెర్రెలు చీలిన చాపాడు చానెల్

- తుప్పుపట్టిన స్లూయిస్‌లు
- పట్టించుకోని అధికారులు



అధ్వాన స్థితిలో ఉన్న స్లూయిస్

చాపాడు, జూలై 3: కర్నూలుజిల్లా రాజోలి నుంచి ఉన్న చాపాడు చానెల్ నెర్రెలు చీలింది. చాపాడు చానెల్ రాజోలి నుంచి రాజుపాళెం, ప్రొద్దుటూరు మండలాల ద్వారా చాపాడు మండలంలోని వెదురూరు గ్రామం వరకు 40 కి.మీ. పొడవునా నిర్మించారు. 20 ఏళ్ల క్రితం సుమారు రూ.30 కోట్ల జపాన్ నిధులతో కాలువలు సిమెంటు లైనింగ్‌కు వేశారు. ప్రస్తుతం ఈ చాపాడు చానెల్ చాలాచోట్ల దెబ్బతింది. కాలువకు ఇరువైపులా నెర్రెలు చీలడంతో కుంగిపోయింది. కేసీ కెనాల్‌కు ఉపకాలువ చాపాడుచానెల్. శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా కేసీ కెనాల్‌కు చాపాడు చానెల్‌కు సాగునీరు వస్తుంది. ఈ మూడు మండలాలకు ప్రధాన జలవనరు కేసీ కెనాల్. కాలువలో సాగునీరు పారినప్పుడు నెర్రెల ద్వారా భూమిలోకి ఇంకిపోతోంది. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. చాలా చోట్ల స్లూయిస్‌లు ఎందుకూ పనికిరాకుండా తయారయ్యాయి. కొన్ని చోట్ల తుప్పు పట్టి ఉన్నాయి. మరికొన్న చోట్ల అవి పనిచేయకపోవడంతో తొలగించారు. చాపాడు కాలువ నుంచి చిన్నకాలువ ద్వారా భూములకు ఈ స్లూయిస్ ద్వారా సాగునీరు అందుతుంది. స్లూయిస్‌లు లేకపోవడంతో కాలువలోని నీటిని లస్కర్లు కంట్రోల్ చేయలేకపోతున్నారు. అన్ని గ్రామాలకు వాటా ప్రకారం సమానంగా సాగునీరు అందడంలేదని రైతులు తెలిపారు. కాలువ చాలా భాగం దెబ్బతినడంతో పనికిరాకుండా పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సిమెంటు లైనింగ్ ప్లేట్ల మాదిరి దెబ్బతిని ఊడిపోతున్నాయి. కొన్ని కల్వర్టుల దగ్గర మట్టి, గడ్డి, పేరుకుపోయింది. దీంతో అవి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వాటిని తొలగించాల్సిన అవసరం ఉంది. చాపాడు చానెల్ పర్యవేక్షకుడుగా ఒక లస్కర్ కూడా లేడు. ఉన్న ఒక లస్కర్ కొన్నేళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. అధికారులు ఆయన సేవలను ఇప్పటికీ కూడా వినియోగించుకుంటున్నారు. ఈ మూడు మండలాల పరిధిలో సుమారు 38 వేల ఎకరాల భూములు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో ఈ చాపాడు చానెల్‌కు సాగు నీరు విడుదల చేస్తారు. నాగులపల్లె, పల్లవోలు, చాపాడు, నక్కలదిన్నె, రాజువారిపేట, అనంతపురం, ఇంకాపలు గ్రామాల పరిధిలో రైతులు, వరి, వేరుశనగ, పత్తి, మిరప వంటి పంటలు సాగు చేశారు. ఈ మూడు మండలాల ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. కాలువ దెబ్బతిని అధ్వానంగా ఉంది. గత ప్రభుత్వం ఈ చాపాడు చానెల్ గురించి ఏమాత్రం పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. అధికారులు కూడా తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా చాపాడు చానెల్‌కు ఆధునికీకరణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని వారు కోరుతున్నారు.



కల్వర్టు వద్ద పెరిగిన గడ్డి, నెర్రెలు చీలి దెబ్బతిన్న కాలువ

సర్టిఫికెట్లు అందజేత

జమ్మలమడుగు, జూలై 3: జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో 30 మంది అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.కాగా ఈనెల 8వ తేదీ నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తు చేసుకున్నవారికి ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అలాంటివారు కళాశాల వద్దకు వచ్చి మరింత సమాచారం కోసం 9000479991 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి మహమ్మద్‌గౌస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఏపీడీ

ఖాజీపేట, జూలై 3: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ జుబేదా పరిశీలించారు. బుధవారం సోములవారిపల్లెలోని పిచ్చిపాటిపల్లెలో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో ఇచ్చిన కొలతలను సక్రమంగా చేయగలిగితే రూ.300 కూలి వస్తుందని, ఇష్టానుసారంగా పనిచేస్తే తక్కువ కూలి వస్తుందన్నారు. కాలువలు లోతు తీయాలని అన్నారు. అలాగే పండ్ల తోటలు సాగు చేసే రైతులు దరఖాస్తు చేసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి వుండాలి

ప్రొద్దుటూరు, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన కొత్త చట్టాలపై సచివాలయ మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన పెంచుకోవాలని రూరల్ ఐసీడీఎస్ సీడీపీవో అరుణకుమారి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లకు కొత్తచట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం పీవో సునీత ,సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కళావతి, ఈశ్వరి, విఘ్నేశ్వరి, గౌసియా, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్కర్ల డిప్యూటేషన్లు రద్దు చేయాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ వర్కర్లు

ప్రొద్దుటూరు జూలై 3 : మున్సిపాలిటీలోని పారిశుధ్య విభాగంలో పేర్లుండి పారిశుధ్య పనులు చేయకుండా కార్యాలయాలు, స్కూళ్లలోవున్న వర్కర్ల డిప్యూటేషన్లు రద్దు చేయాలని, అలాగే పర్మినెంట్ వర్కర్లు పెట్టుకున్న బదిలీలు రద్దు చేయాలని ఎమ్మెల్యే అధికారులు ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి ఫిర్యాదు చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి ఆయనకు సమస్యలు విన్నవించారు.దీనిపై ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ త్వరలో అందరి సమస్య తీరుస్తా, అంతవరకు ఓపిక పట్టాలని తెలిపారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి - ఎంఈఓ

మైలవరం, జూలై 3 :బడి బయటి పిల్లలు అందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంఈఓ చిట్టిబాబు అన్నారు.బుధవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో విద్యాప్రవేశంలో భాగంగా నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ కార్యక్రమాన్ని ఎంఈఓ ప్రారంభించారు. అలాగే ఎం, కంబాలదిన్నె గ్రామంలోని పాఠశాలలో ఎంఈఓ చిట్టిబాబు నూతనంగా నిర్మించిన వంటగదిని ప్రారంభించి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, రమేష్‌బాబు, ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలి

పూర్తయిన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , జూలై 3 : నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం పనులు త్వరిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కొత్తపల్లె పంచాయతీ పరిధిలోవున్న ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెకానిక్ షెడ్ పరిస్థితి గురించి ఆరాతీశారు. రిపేరులోవున్న బస్సులు వివరాలు అడిగితెలుసుకున్నారు. మెకానిక్ షెడ్‌తోపాటు అందులోని వస్తువులు, క్యాంటీన్, విచారణ కేంద్రం, పార్శిల్ కౌంటర్‌ను పరిశీలించారు. ఈ పరిశీలనలో డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 3: పాత మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు. మూడునెలల15 రోజులకు భక్తులు 1,34,924 రూపాయలు కానుకల రూపంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ ఈవో రమణారెడ్డి, ఆలయ ఛైర్మన్ సత్యనారాయణ, సభ్యుడు కిశోర్, రాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే రిలే దీక్షలు చేపడతాం

పోరుమామిళ్ల, జూలై 3 : పెరిగిన ధరలకనుగుణంగా పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని వారి సమస్యలు పరిష్కరించకుంటే రిలే దీక్షలు చేపడతామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్లలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట పోరుమామిళ్ల, రంగసముద్రంలో పనిచేస్తున్న కార్మికులతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి కార్మికులుగా కొనసాగుతున్నారని ఆన్‌లైన్ టెండర్ల ద్వారా పంచాయతీలో నియామకం చేసుకుని కొనసాగిస్తున్నారన్నారు. కానీ ఇటీవల దళారుల తాకిడి ఎక్కువైందని, వన్‌సైడ్ టెండరుతో కార్మిక కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నారన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన



అట్లూరు, జూలై 3 : మండలంలోని కొండూరు వద్ద ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాన్ని బుధవారం బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. పంపిణీ పారదర్శకంగా ఉండాలన్నారు. రేషన్ తీసుకున్న వారితో మాట్లాడారు. ప్రతినెలా రేషన్ పంపిణీ వాహనం ఇంటింటికీ వస్తుందా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దారు వేణుగోపాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు కరీముల్లా, వీఆర్వో దొరబాబు ఉన్నారు.

ఆర్థికసాయం



అట్లూరు, జూలై 3 : మండలంలోని కామసముద్రం గ్రామానికి చెందిన అయ్యవారయ్య మే 23న కువైత్‌లో మృతి చెందాడు. మృతి చెందిన అయ్యవారయ్య కుటుంబానికి ఆర్థికసాయంగా కువైత్‌యాదవ సంఘం తరపున ఆ సంఘం అధ్యక్షుడు చల్లబాబు, యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజా, అట్లూరు యాదవ సంఘం అధ్యక్షుడు ఆవుపోలు మునెయ్య, పైడి యల్లయ్య, మృతుడి భార్య లక్ష్మమ్మకు కామసముద్రం గ్రామంలో బుధవారం లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

కారుణ్యనియామకాలపై కాఠిన్యమెందుకు?



మాట్లాడుతున్న రమణారెడ్డి

కలసపాడు, జూలై 3 : కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి కారుణ్య నియామకాల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్న ఉద్యోగుల కుటుంబసభ్యులపై కనికరం చూపాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సాయంత్రం కలసపాడులోని మండల పరిషత్‌ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎస్టీయూ మండలశాఖ కార్యవర్గసమావేశం సి.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమణారెడ్డి మాట్లాడుతూ ప్రమాదాలు, కరోనా అనారోగ్యం తదితర కారణాలతో చనిపోయిన ఉద్యోగ,ఉపాధ్యాయ ఆధారిత కుటుంబసభ్యులకు వారి విద్యార్హతలను బట్టి పోస్టులు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్‌బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లాకమిటీ కన్వీనరు సత్యనారాయణ,శివారెడ్డి,మండలశాఖ ప్రధాన ఆర్థిక కార్యదర్శులు బీఎస్‌వీ ప్రసాద్, బాలచెన్నయ్య, శ్రీనివాసులు, బాలరాజునాయక్ పాల్గొన్నారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



వంటశాలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

జమ్మలమడుగు, జూలై 3: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో ప్రొద్దుటూరు రోడ్డు లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర వసతి గృహాన్ని బుధవారం కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయేరియాను అరికట్టడంలో భాగంగా ముందస్తుగా వసతి గృహాలను తనిఖీ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వసతి గృహాలను తనిఖీ చేసి నీటి సరఫరా, పారిశుధ్యంపై వార్డెన్లకు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ బాలమల్లేశ్వర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది, వార్డెన్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికల హాస్టల్...

ఎర్రగుంట్ల, జూలై 3: ఎర్రగుంట్ల రాజీవనంలో ఉన్న బాలికల ఎస్సీ హాస్టల్‌ను ఎర్రగుంట్ల తహసీల్దార్ సౌజన్యలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార విషయాలపై ఆరాదీశారు. హాస్టల్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాలికల భద్రతపై ఆరా దీశారు. వాటర్ ట్యాంకులను శుభ్రం ఎప్పుడు చేశారని ప్రశ్నించారు. అలాగే పారిశుధ్యంపై పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగేనీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని వారికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ, వీఆర్‌వోలు, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

కంప చెట్లు తొలగింపు



మైదుకూరు రూరల్ జూలై 3 : సొంత గ్రామంలో రహదారులకు ఇరువైపుల ఏపుగా పెరిగిన కంప చెట్లు, రోడ్డుకు ఇరువైపులా కంప కొడుతున్న చెత్తచెదారాలను మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన టీడీపీ యువ నాయకుడు పొలిమేర శివశంకర్‌రెడ్డి దాదాపు 20వేల రూపాయలు వెచ్చించి శుభ్రం చేయించారు. గ్రామంలోని మరి కొంత మంది యువకుల సాయంతో కేశలింగాయపల్లె ,శెట్టివారిపల్లె గ్రామం,ఎస్టీ కాలనీలో డోజర్‌ను బాడుగకు తీసుకొని బుధవారం రోడ్లను శుభ్రం చేయించారు. రోడ్డు మలుపుల్లో కంప చెట్లు ఏపుగా పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన సదస్సు



జమ్మలమడుగులో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి, చాపాడులో మాట్లాడుతున్న మాధవి

జమ్మలమడుగు, జూలై 3: జమ్మలమడుగులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో బుధవారం కొత్త చట్టాలపై గ్రామ, వార్డు, సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్‌ను భారతీయ న్యాయసంహిత బీఎన్‌ఎస్‌గా, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను భారతీయ న్యాయసురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్టును భారతీయ సాక్ష అభినయ (బీఎస్ఏ) మూడు కొత్త చట్టాలను జూలై 1, 2024 నుండి భారతదేశంలో అమలు అవుతోందన్నారు. ఈ కొత్త చట్టాలపై గ్రామ, వార్డు, సచివాలయ మహిళా పోలీసులకు సదస్సు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరీదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, జమ్మలమడుగు కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సుబ్బారావు, సూపర్‌వైజర్లు సునీత, గౌషియా, సైరాభాను, వెంకటలక్ష్మి, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తయారు చేసిన కొత్త చట్టాల గురించి అందరూ తెలుసుకోవాలని జిల్లా బాలలసంరక్షణ హక్కుల అధికారి మాధవి అన్నారు. చాపాడులోని వెలుగు కార్యాలయంలో బుధవారం కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్షి సంహిత అనే మూడు చట్టాలను తయారు చేసినట్లు చెప్పారు. ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామాల్లోని ప్రజలకు ఈ చట్టాలపై అవగాహన కలిగించాలన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ఈ చట్టాలు అమలులోకి వచ్చినట్లు చెప్పారు. ఇకమీదట ఏదైనా సమస్యలపై ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సావిత్రమ్మ, ఏపీఎం వెంకటరమణ, బీడీవో రవిశంకర్‌రెడ్డి, ఏపీవో జగదీష్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, సౌజన్య, వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.